సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 4 । జూలై । 2023



అనంత, నెల్లూరు జట్ల విజయం

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 వన్డే క్రికెట్ టోర్నీలో శనివారం అనంతపురం, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. - IIలో



విద్యార్థి మృతిపై వీడనున్న మిస్టరీ

భీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్‌లో చదువుతున్న సోహిత్ అనే విద్యార్థి మృతిపై మిస్టరీ వీడనుంది.ఎస్పీ స్వయంగా పరిశీలించి విచారణ చేపట్టారు. - IIలో



ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. - IIలో

న్యూస్‌రీల్

బాధితులకు న్యాయం చేయాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. వీటిని నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

సాగర్‌లో చేపల వేట నిషేధం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంసాగర్‌లో జులై 1నుంచి ఆగస్టు 31 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపలవేట నిషేధిస్తునట్లు ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి మద్దిలేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు చేప గుడ్డు దశలో ఉండడంతో అటువంటి వాటిని వేటాడితే పిల్లలు ఉత్పత్తి కావన్నారు.అందువల్ల సాగర్‌లో ఎవరైనా చేపలవేటకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కళాశాల ప్రగతికి కష్టపడాలి



మాట్లాడుతున్న మను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

కడప ఎడ్యుకేషన్ : మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేసే ప్రతి ఒక్కరూ కళాశాల ప్రగతికి కష్టపడి పనిచేయాలని మను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కళాశాలను సందర్శించారు. మను పూర్వ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ రహ్మతుల్లా, ప్రొఫెసర్ అబ్దుల్ వహీద్ సమక్షంలో కళాశాల బిల్డింగ్ ప్రారంభానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి, దీనికి గుర్తుగా మొక్కను నాటారు. కళాశాలలో సోలార్ పవర్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి యూనివర్సిటీకి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్, ప్రొఫెసర్ హకీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో భక్తుల సందడి



బ్రహ్మంగారిమఠంలో భక్తులు

బ్రహ్మంగారిమఠం : గురు పౌర్ణమి రోజు గురు భక్తిని చాటుకొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాలనుంచి సోమవారం పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన వారు స్వామి దర్శనం అనంతరం స్థానికంగా ఉంటున్న మఠాధిపతిని కలసి ఆయన ఆశీర్వాదం తీసుకుని మొక్కులు చెల్లించుకుంటారు. మఠాధిపతి వీరభోగ వసంత వెంటేశ్వరస్వామి కరోనాలో శివైక్యం చెందడంతో అప్పటినుంచి ప్రభుత్వం, ఎండోమెంట్ అధికారులు మఠాధిపతి నియామకం చేయలేదు. గురుపౌర్ణమి సందర్భంగా మఠాధిపతి నివాసం దగ్గరకు వెళ్లగా అక్కడ ఆయన పెద్ద కుమారుడు వెంకటాద్రిస్వామి, రెండో కుమారుడు వీరభద్రయ్యస్వామి, స్వామి రెండో భార్య మహాలక్ష్మమ్మలు ఆసీనులై ఉన్నారు. గురువులు అధికంగా ఉండడంతో కొంతమంది భక్తులు మొక్కొని వెళ్లిపోయారు, ఈశ్వరీదేవిమఠం, అచలానంద ఆశ్రమం, సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

20 ఎకరాలకు ఎన్‌ఓసీ ఇవ్వలేదు

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లా ఎలిమెంటరీ, సెకండరీ స్కూల్ టీచర్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి సంబంధించి 20 ఎకరాలకు ఎన్‌ఓసీ ఇవ్వలేదని సొసైటీ అధ్యక్షుడు బి.లక్ష్మిరాజా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తహసీల్దార్ శోత్రియం దారులకు ఇచ్చిన రైతు వారి పట్టాను రద్దు చేయాలని స్పందనలో జిల్లా కలెక్టర్‌కు , ఆర్డీఓకు, సీకెదిన్నె మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఆర్డీవో కోర్టులో కేసు ఫైల్ చేసినట్లు తెలిపారు.

నిబంధనలు బేఖాతర్

- ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కొనుగోలుకు ముందుకురాని యాజమాన్యాలు
- 1 నుంచి టెన్త్ వరకు సర్కారువే కొనాలని ఆదేశించినా పట్టించుకోని వైనం
- బడులు తెరిచేనాటికే పుస్తకాలను సిద్ధం చేసిన ప్రభుత్వం



ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్యపుస్తకాలు

855	జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు
513	పాఠ్యపుస్తకాలు కావాలని ఇండెంట్ పెట్టినవి
4,45,39875	ఇండెంట్ పెట్టిన పుస్తకాలు
రూ. 3,01,10,658	వీటికి అయ్యే డబ్బు
రూ. 15,08,076	5 శాతం మేర చెల్లించిన డబ్బుల మొత్తం

కడప ఎడ్యుకేషన్ : ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్యపుస్తకాలనే కొనుగోలు చేయాలన్న నిబంధనలకు యాజమాన్యాలు తూట్లు పొడుస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు భారాన్ని తల్లిదండ్రులకు తగ్గించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుకారుస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల వారు ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్యపుస్తకాలను అరకొరగా కొనుగోలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలను బేఖాతార్ చేస్తున్నారు. చివరకు తమకు సంబంధించిన పుస్తకాలనే పిల్లలకు అంటగడుతూ తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేసి వారిపై భారం మోపుతున్నారు.

ఫీజులతోపాటు పుస్తకాలకు ముందుగానే...

జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాల వారు విద్యార్థుల తల్లితండ్రుల నుంచి ఫీజులు, పుస్తకాల పేరుతో వేలకు వేలు దండుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీటిల్లో పుస్తకాలను అమ్మకూడదని నిబంధన ఉంది. కానీ ఈ నిబంధన ఎక్కడా వందశాతం అమలు కావడం లేదు. దీంతోపాటు అన్ని ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు మొదటి టర్మ్ ఫీజు, పుస్తకాలకు కూడా డబ్బులు కట్టించుకుని విద్యార్థులకు అంటగడుతున్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణా సంస్థ(ఎస్సీఈఆర్టీ) విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా సబ్జెక్టు నిపుణులతో పాఠ్యపుస్తకాలను రూపొందించింది. వాటిని ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు కొనుగోలు చేయడం లేదు. వారు తయారు చేసుకున్న అనధికార పాఠ్య పుస్తకాలతో తరగతులను నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ ద్వారా రూపొందించిన పాఠ్యపుస్తకాలతో బోధించాలని 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను సిద్ధం చేసింది. కానీ యాజమాన్యాలు అరకొరగా కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

513 స్కూళ్ల నుంచే ఆర్డర్..

జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు తమకు కావాల్సిన పాఠ్యపుస్తకాల వివరాలను అందించి విద్యాశాఖకు ఐదు శాతం మొత్తాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పుస్తకాలను అందిస్తుంది. విద్యార్థులు లేదా యాజమాన్యాల వారు మిలిగిన 95 శాతం చెల్లించి పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా ఎవరికి భారం కాకుండా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు పుస్తకాలను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 36 మండలాల పరిధిలో 855 ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 513 పాఠశాలలు మాత్రమే పాఠ్యపుస్తకాలు కావాలని 5 శాతం డబ్బులు చెల్లించి అర్డర్ పెట్టారు. మిగిలిన పాఠశాలలు పట్టించుకోవడం లేదని తెలిసింది. ప్రస్తుతం 4,45,398 పుస్తకాలు అవసరమని ఆర్డర్ పెట్టారు. వీటికి సంబంధించి రూ. 3,01,10,658 అవుతాయి. ఇందులో 5 శాతం ప్రకారం 15,08,076 లక్షలు చెల్లించారు. మిగిలిన పాఠశాలల నుంచి కొనుగోలుకు ఆర్డర్స్ రాలేదు. పాఠ్యపుస్తకాలను మావద్దే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేయడంతో చేసేదేమీ లేక తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పష్టం చేసినా...

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు అవసరమైన పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎం లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో అర్డర్ చేసి కొనేసేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సంబంధిత విషయాన్ని విద్యాశాఖ అధికారుల ద్వారా పాఠశాలల యాజమాన్యాలకు సమాచారాన్ని చేరవేసింది. కానీ అన్ని ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు స్పందించడం లేదు. పాఠ్యపుస్తకాలను కొనగోలు చేయకపోతే పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని డీఈఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీంతో కొన్ని యాజమాన్యాలు తప్పని పరస్థితుల్లో అరకొరగా కొనుగోలుకు ముందుకు వస్తున్నట్లు తెలిసింది.

పుస్తకాలను కచ్చితంగా తీసుకోవాలి



ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలను కచ్చితంగా తీసుకెళ్లాలి. తరగతుల వారీగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 5 శాతం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. మిగిలిన మొత్తాన్ని విక్రయదారులకు చెల్లించి పుస్తకాలను తీసుకెళ్లాలి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠ్యపుస్తకాలను తీసుకెళ్లకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే యాజమాన్యలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రాఘవరెడ్డి, డీఈఓ, వైఎస్సార్‌జిల్లా.

జిల్లాలో మోస్తరు వర్షం

– చక్రాయపేటలో 24.2 మి.మీ వర్షపాతం నమోదు

కడప అగ్రికల్చర్ : జిల్లావ్యాప్తంగా సోమవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. చక్రాయపేటలో అత్యధికంగా 24.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా గోపవరంలో 1 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది.

మండలం	నమోదైన వర్షం (మి.మీ)		
		కొండాపురం	19.4
		ముద్దనూరు	17.2
		దువ్వూరు	13.2
చక్రాయపేట	24.2	వేంపల్లి	11.6
పోరుమామిళ్ల	23.2	కలసపాడు	10.4
కమలాపురం	22.6	వల్లూరు	10.4
సింహాద్రిపురం	20.8	ఎర్రగుంట్ల	10.0

97.36 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



ప్రొద్దుటూరు: సోములవారిపల్లె-4లో అంకమ్మకు పింఛన్‌ను ఇస్తున్న విష్ణు మాధవరెడ్డి

కడప రూరల్ : జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ల పంపిణీ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. మూడవరోజైన సోమవారం నాటికి మొత్తం 2,52,280 పింఛన్లకు సంబంధించి మొత్తం రూ. 69,51,00,500కు గాను 2,45,711 పింఛన్లకు రూ. 67,79,49,750 నగదును పంపిణీ చేశారు. వలంటీర్లు ఇంటింటికి వెళ్లి అర్హులైన వారికి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రక్రియ రెండో రోజుకే చివరి దశకు చేరుకోవడం గమనార్హం. త్వరితగతిన పింఛన్లు అందుకోవడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'సురక్ష'తో అర్హులకు సంక్షేమ పథకాలు

కలెక్టర్ విజయరామరాజు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజా ఉపయోగ సంక్షేమ పథకాల ఫలాలు అర్హత ఉండి ఇంకా అందుకోలేకపోయిన వారందరికీ లబ్ధి చేకూర్చాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ×జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జులై 1 నుంచి ఆగస్టు 1 వరకు ప్రతి వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన ప్రతి రిక్వెస్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధన దిశగా

సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనలో భాగంగా.. హౌసింగ్, హెల్త్ / ఐసీడీఎస్ పరిధిలో ప్రభుత్వ పథకాల అమలు, ప్రయారిటీ బిల్డింగుల నిర్మాణం, మనబడి - నాడు నేడు పనులు, గ్రామ/వార్డు సచివాలయాల్లో సేవలు, వైఎస్ఆర్ భీమా, కల్యాణమస్తు, గడప గడపకు మన ప్రభుత్వం, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ విజయరామరాజు వీసీ ద్వారా అధికారులతో సమీక్షించారు. పేదలకు ఇళ్లు పథకంలో భాగంగా చేపడుతున్న.. గృహ నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతివారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమం ద్వారా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివద్ధి పనులను లక్ష్యం మేరకు వేగంగా పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పనుల్లో భాగంగా చేపట్టిన పాఠశాలల అభివద్ధి పనులను, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

- గ్రామ వార్డు సచివాలయల్లో బయోమెట్రిక్ హాజరు ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని.. ఇకపై అటెండెన్స్ నిర్వహణలో వంద శాతం నమోదు కావాలని ఎంపీడీవోలు, కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో బోర్డు మీటింగ్ హాలు నుండి శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్ గౌడ్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు ధర్మచంద్రా రెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ, హౌసింగ్, ఆనంద్‌నాయక్, కృష్ణయ్య,సీపీవో వెంకట్రావు, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, శివశంకర్ రెడ్డి, నరసింహులు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీపీవో ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ విజయరామరాజు ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణ్‌రెడ్డి, ఆనంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు

2024 జనవరి 1కి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఓటు ప్రాధాన్యతను అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ప్రజల్లో అవగాహన పెంచాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో రేషనలైజేషన్ ప్రక్రియ ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఓటర్లుగా పేరు నమోదు చేసుకోని అర్హులైన వారంతా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఎలక్టార్ వెరిఫికేషన్ ప్రోగామ్ వేగవంతంగా చేపట్టాలన్నారు.

- ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు త్రైమాసిక పరిశీలనలో భాగంగా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ల రికార్డులను, రిజిష్టర్లను పరిశీలించారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై సౌమ్యనాథుడు



సూర్యప్రభవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

నందలూరు(రాజంపేట) : సౌమ్యనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఆలయ మాఢవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాలు, కోలాటాల మధ్య స్వామి ఊరేగింపు జరగింది. వాహనసేవలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచి భూమన శంకర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, వైఎస్సార్‌సీపీ నేతలు నాని, ప్రభాకర్, పెనుబాలనాగసుబ్బయ్య, కాకిచంద్ర, గుణయాదవ్, టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చారు.అర్చకులుసునీల్,సాయిలు ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించారు.

• ఘనంగా గురుపౌర్ణమి



ప్రత్యేక అలంకరణలో ప్రొద్దుటూరులోని వసంతపేటలో కొలువై ఉన్న సాయిబాబా

విజ్ఞాన దీపాలను వెలిగిస్తూ..అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తూ..తను కాంతినిస్తూ..తరగతి గదినే తరగని నిధిలా మార్చేందుకు నిత్యం శ్రమిస్తారు గురువులు.ఆషాఢ(వ్యాస) పౌర్ణమి సందర్భంగా గురుదేవుళ్లకు వందనం .ఈ సందర్భంగా సోమవారం జిల్లాలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.బాబా విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం, రాత్రి సాయినామ సంకీర్తన నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

కడప ఎడ్యుకేషన్ : వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో నిర్వహిస్తున్న సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తెలిపారు. కమలాపురంలో ఒకరు, పుల్లారెడ్డిపేటలో ఇద్దరు. బ్రహ్మంగారి మఠంలో ఒకరి చొప్పున కాపీయింగ్‌కు పాల్పడిన వారిని స్క్వాడ్ సభ్యులు డీబార్ చేసినట్లు ఆయన చెప్పారు.

నేడు డీఈఓ కార్యాలయానికి హాజరుకావాలి

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు, పాఠశాల సహాయకులు సోసియల్ (తెలుగు మీడియం) పదోన్నతికి సంబంధించి మంగళవారం డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది. జిల్లా పరిషత్తు యాజమాన్యంలో పనిచేస్తున్న పాఠశాల సహాయకులు, సెకండరీ గ్రేడ్ తత్సమాన హోదా గల ఉపాధ్యాయులు సేవాపుస్తకం, సర్టిఫికెట్లతో హాజరుకావాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. సీనియారిటీ జాబితాను కడప జిల్లా విద్యాశాఖ అంతర్జాలం www.kadapadeo.com పొందుపరిచినట్లు డీఈఓ చెప్పారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వేముల : మండలంలోని వేల్పుల గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భరత్ (25) అనే యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు సేలంకు చెందిన భరత్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా వేల్పుల గ్రామంలో డ్రైనేజీ పనులు చేసి మధ్యాహ్న సమయంలో భోజనానికి పులివెందులకు వెళ్లాడు. అక్కడి నుంచి వేల్పులకు వస్తుండగా.. అక్కడికి రాగానే బైకు అదుపుతప్పి కిందపడ్డాడు. అదే సమయంలో వేంపల్లె వైపు నుంచి వెళుతున్న లారీ అతనిపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పోరుమామిళ్ల : పట్టణ పరిధిలోని గిరినగర్‌కు చెందిన బెల్లం సోనీ ప్రియాంక (24) సోమవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆమె పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తుండేది. భర్త పవన్‌కుమార్ కూలీ పనులకు వెళ్తుంటాడు. వారికి ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. భర్త వేధింపుల కారణంగా మృతి చెందినట్లు మృతురాలి అన్న సామ్యూలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇరుగు పొరుగువారు, పిల్లలు ఇంట్లో ఎలాంటి ఘటన జరగలేదని చెప్పారన్నారు. కుటుంబ అవసరాల కోసం తెచ్చిన లక్ష రూపాయల అప్పు కోసం ఒత్తిడి ఎక్కువయిందని, ఆ కారణంగా మృతి చెంది ఉండవచ్చని భర్త పవన్‌కుమార్ చెప్పాడన్నారు. కేసు దర్యాప్తులో వాస్తవాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

దాడి కేసులో ఐదుగురి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని కృష్ణ సర్కిల్ సమీపంలో ఈ నెల 1వ తేదీ రాత్రి ఇరువర్గాలు కత్తులతో దాడులు చేసుకున్నాయి. ఈ కేసుకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు కడప ఒన్‌టౌన్ పోలీసులు తెలియజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడపకు చెందిన షఫీవుల్లా, రఫీ ఉల్లా ఉద్దీన్‌లకు మనస్పర్ధలున్నాయి. ఈనెల ఒకటో తేదీన ఫోన్‌లో ఇరువురు గొడవ పడి, అనంతరం తమ మద్దతుదారులతో కృష్ణ సర్కిల్ వద్దకు వచ్చి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ కేసుకు సంబంధించి షేక్ అబుబకర్, సయ్యద్ షాకీర్, చింతకుంట షేక్ మహమ్మద్ రఫీఉద్దీన్, షేక్ మహమ్మద్ షఫీవుల్లా, షేక్ హబీబుల్లాలను అరెస్ట్ చేసి వారిని రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థి మృతిపై వీడనున్న మిస్టరీ

- భీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో ఎస్పీ విచారణ
- వెలుగులోకి వచ్చిన పలు అంశాలు
- సీసీ ఫుటేజీల పరిశీలన

ఖాజీపేట : మండలంలోని భీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న సోహిత్ అనే విద్యార్థి మృతి పెద్ద సంచలనంగా మారింది. అనేక అనుమానాలు వ్యక్తం కావడంతో జిల్లా ఎస్పీ అన్బురాజన్ సోమవారం స్వయంగా వచ్చి విచారణ చేపట్టారు. సమగ్రంగా దర్యాప్తు చేశారు. పలు అంశాలు వెల్లడయ్యాయి. విద్యార్థి మృతిపై మిస్టరీ వీడనుంది. నేడో, రేపో మీడియా ఎదుట వివరాలు వెల్లడించేందుకు ఎస్పీ రంగం సిద్ధం చేసుకున్నారు.

సిబ్బంది, విద్యార్థులను విచారణ

హాస్టల్ సిబ్బంది, విద్యార్థులను ఎస్పీ విచారణ చేశారు. చనిపోయిన రోజు, ముందు రోజు, మృతి చెందిన తరువాత ఏం జరిగింది అన్న దాని పై అడిగి తెలుసుకున్నారు. రూమ్ కేర్‌టేకర్, హాస్టల్ కేర్ టేకర్‌తో మాట్లాడారు. వెలుగు చూసిన విషయాలు ఇలా ఉన్నాయి. జూన్ 19న 6వ తరగతిలో విద్యార్థి జాయిన్ అయ్యాడు. హాస్టల్‌లో చేర్పించారు. అప్పటి నుంచి కొద్ది రోజుల వరకు బాగా ఉన్న విద్యార్థి హోమ్‌సిక్‌కు


వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్పీ అన్బురాజన్

గురైనట్లు గుర్తించారు. రోజూ తెల్లవారు జామున 5.30 గంటలకు విద్యార్థులను రూమ్‌కేర్ నిద్ర లేపుతారు.

హాస్టల్ పైకి వెళ్లి:

అయితే సోహిత్ 1వ తేది ఉదయం 5 గంటలకే నిద్ర లేచి హాస్టల్ పై అంతస్తుకు వెళ్లాడు. అక్కడి నుంచి గోడ పైకి ఎక్కేందుకు దగ్గరలో ఉన్న రాయి ఎత్తుకోసం ప్రయత్నించాడు. రాయి బరువుగా ఉండటంతో బాత్ రూమ్ బకెట్ సాయం తీసుకుని.. బకెట్ పైకి ఎక్కి నాలుగు అంతస్తుల భవనం పైన ఉన్న గోడను ఎక్కాడు. అక్కడి నుంచి ఉదయం 5 గంటల 18 నిమిషాలకు దూకినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే మొదటి అంతస్తులో వైర్లు ఉండటం వల్ల పై నుంచి నేరుగా కింద పడకుండా..


వేలిముద్రలు తీసుకుంటున్న క్లూస్ టీం

విద్యుత్ వైర్లపై పడి తరువాత కింద పడ్డాడు. ఆ వైర్లకు విద్యుత్ సరఫరా లేదు. విద్యార్థి పైకి వెళ్లడం, కింద పడిన తరువాత దృశ్యాలు సీసీ ఫుటేజీలో నిక్షిప్తమై ఉన్నాయి. కింద పడ్డ అనంతరం విద్యార్థుల పక్కనే ఉన్న తాపలపై కూర్చున్నాడు. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది చేరుకుని ఏమైందని విద్యార్థిని అడిగారు. కడుపు నొప్పిగా ఉందని చేతులు కడుపులో నొక్కుకుంటూ సమాధానం ఇచ్చాడు. వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్‌ను సిబ్బందికి చెప్పాడు. వెంటనే సమాచారం తల్లిదండ్రులకు అందించారు. వారు తమ బంధువులు వస్తారని సూ చించారు. 5.40కి అక్కడికి విద్యార్థి బంధువులు వచ్చి విద్యార్థిని చికిత్స నిమిత్తం తీసుకుని వెళ్లారు. విద్యార్థి బంధువుల ఇంటికి వెళ్లిన తరువాత మృతి చెందాడు.

సీసీ ఫుటేజీల పరిశీలన

హాస్టల్‌లో ఉన్న అన్ని సీసీ ఫుటేజీలను పోలీసులు పూర్తిగా పరిశీలించారు. మృతి చెందిన విద్యార్థి తల్లిదండ్రులకు, బంధువులకు ఫుటేజీలను పోలీసులు చూపించినట్లు తెలుస్తోంది. అలాగే రికార్డు అయిన అన్ని దృశ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

హాస్టల్ పైకి వెళ్లి పరిశీలన

ఎస్పీ హాస్టల్ రూమ్ నుంచి 4వ అంతస్తు పైకి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఎవరు ఉంటారు అనే విషయంపై విచారణ చేశారు. అనంతరం మేడ పై నుంచి కింద పడ్డ స్థలాన్ని పరిశీలించారు. ఎన్ని గంటలకు విద్యార్థి కింద పడ్డాడు, మొదట చూసిన వ్యక్తులు ఎవరు, ఇలా అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. మేడ పై నుంచి వెళ్లే వ్యక్తులు, విద్యార్థితో బాగా సన్నిహితంగా ఉన్న వారిని పిలిపించి విచారణ చేశారు. అనంతరం మైదుకూరు డీఎస్పీ, రూరల్ సీఐలు విద్యార్థులను విచారణ చేసి వారి అభిప్రాయాలను నమోదు చేశారు.

క్లూస్ టీమ్ పరిశీలన

ఎస్పీ ఆదేశాల మేరకు క్లూస్ టీం పరిశీలన చేపట్టారు. విద్యార్థి మేడ పై నుంచి నిలబడ్డ స్థలం, నిలబడేందుకు ఆసరాగా చేసుకున్న బకెట్‌తోపాటు విద్యార్థి గదిలోని లాకర్ ఇలా అన్ని చోట్ల వేలి ముద్రలను క్లూస్ టీం సేకరించింది.

సిద్దవటం రేంజర్‌గా కళావతి



సిద్దవటం: సిద్దవటం మొదటి మహిళా రేంజర్‌గా బి.కళావతి సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. సిద్దవటం రేంజర్‌గా 5 సంవత్సరాల 6 నెలలు పని చేసిన ప్రసాద్ ఈ నెల 12వ తేదీన కడప రేంజర్‌గా బదిలీ అవడంతో డిప్యూటీ రేంజర్ ఓబులేస్ ఇన్‌చార్జి రేంజర్‌గా విధులు నిర్వహించారు. ఈయన స్థానంలో కడపలో 3 నెలల పాటు అసిస్టెంటు రేంజర్‌గా శిక్షణ పొందిన బి.కళావతి సిద్దవటం రేంజికి మొదటి మహిళా రేంజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2017 బ్యాచ్‌లో తాను అనంతరం జిల్లాలో ఎస్ఐగా విధులు నిర్వహించానన్నారు. ఎస్ఐ ఉద్యోగానికి రాజీనామా చేసి అటవీశాఖ వారు నిర్వహించిన పోటీ పరీక్షలో రేంజర్‌గా ఎంపికై కడపలో శిక్షణ పొందానన్నారు. ఈమేరకు అధికారులు సిద్దవటం రేంజర్‌గా ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం బాధ్యతలు చేపట్టానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ఓబులేస్, ఎఫ్‌బీఓలు రాజశేఖర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి, విశ్వనాథ్, దీపిక, విశ్వనాథ్‌రెడ్డి, ఏబీఓలు, ప్రొటెక్షన్ వాచర్‌లు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే తప్పుడు ప్రచారాలు

- పార్టీ కార్యకర్త కాబట్టే శ్రీనివాసులురెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నాం
- జిల్లాలో తామెక్కడా భూ ఆక్రమణలు, అవినీతికి పాల్పడలేదు
- నిరూపిస్తే సొంత ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేయిస్తాం
- వల్లూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దుగ్గాయపల్లె వీరారెడ్డి

కడప రూరల్ : రాజకీయంగా తమ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొంత మంది తప్పుడు ప్రచారాలతో రాద్ధాంతం చేస్తున్నారని, ఎలాంటి ఆధారాలు చూపకుండా తమపై నిందలు మోపడం పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ వల్లూరు మండల కన్వీనర్ దుగ్గాయపల్లె వీరారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల హత్యకు గురైన సి.శ్రీనివాసులురెడ్డి అంతకుముందు టీడీపీలో ఉండేవారని, ఏడాది క్రితం నుంచి వైఎస్సార్‌సీపీలో కార్యకర్తగా కొనసాగే వాడన్నారు. అతను తమ పార్టీ కార్యకర్త కాబట్టే అతని కుటుంబాన్ని పరామర్శించడంతోపాటు అంత్యక్రియల్లో పాల్గొన్నామన్నారు. అంతేగానీ అతని ద్వారా తాము ఏనాడూ ఒక్క రూపాయి సంపాదించింది


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ వల్లూరు మండల కన్వీనర్ దుగ్గాయపల్లె వీరారెడ్డి

లేదన్నారు. శ్రీనివాసులురెడ్డి ద్వారా కోట్లు సంపాదించినట్లుగా కొంత మంది ప్రచారం చేయడం అవాస్తవమని తెలిపారు. కాగా కొన్ని రోజులుగా దుగ్గాయపల్లి బ్రదర్స్ అంటూ తమపై కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. శ్రీనివాసరెడ్డి మృతి చెంది 11 రోజులు కావస్తున్నా కొన్ని పత్రికలు పనిగట్టుకుని తమను టార్గెట్ చేస్తున్నాయన్నారు. తమ కుటుంబం ప్రజల కోసమే పని చేస్తుందని, తన మీద పలు సోషల్ మీడియాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని, తాను చట్ట ప్రకారం కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని, అలాగే నిబంధనల ప్రకారం ఆదాయ పన్ను కడుతున్నానన్నారు. అలాంటి తమపై అనవసరంగా రాద్ధాంతాలు చేయడం సరికాదన్నారు. తాము అరాచకాలు చేసి ఉంటే, ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా కేసులు ఉన్నాయేమో చూడాలని, మా అన్న మల్లికార్జునరెడ్డికి గానీ, తనకు గానీ ఇసుక రీచ్ లు ఉన్నాయేమో చూపించాలని ప్రశ్నించారు. 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాం.. ప్రజల్లో తిరుగుతున్నామని తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా సెంటు భూమి కబ్జా చేసి వుంటే నిరూపించండి.. అలా నిరూపిస్తే తన సొంత ఖర్చుతో సంబంధిత భూమి కలవారికి రిజిస్ట్రేషన్ చేయిస్తానన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు అవుతోందని, ఇప్పటి వరకు ఎక్కడా ఎటువంటి కబ్జాలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు తాము కట్టుబడి ఉంటామని ఆయన వివరించారు. కాగా ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలపై అక్రమాలు చేశారంటూ కరపత్రాలు ప్రచురించారన్నారు. ఆ కరపత్రాల్లో కుటుంబ సభ్యులను కూడా పేర్కొనడం పట్ల ప్రజలు చీదరించుకుంటున్నారని తెలిపారు. ఊరు, పేరు లేకుండా కరపత్రాలైతే ప్రచురించారు గానీ, అందులో వాస్తవాలను నిరూపించే ఒక్క ఆధారమైనా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. తమకు 30 ఏళ్ల క్రితమే 130 ఎకరాల భూమి ఉందని, తాము వ్యవసాయమైనా చేసుకుంటాం.. తప్పుడు పనులు ఎన్నడూ చేయబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబవరం సర్పంచ్ ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కిశోర్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు బాలిరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

వేముల : గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరిని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డిలు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. బండలాగుడు పోటీలలో తెలంగాణాకు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి ఎద్దులు 3 వేల అడుగులు, బాపట్లకు చెందిన శిరీష చౌదరి ఎద్దులు 2769, అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులు ఎద్దులు 2630, నంద్యాల జిల్లా కీర్తిపల్లెకు చెందిన భరత్‌కుమార్ యాదవ్ ఎద్దులు 2541, గద్వాల్ జిల్లాకు చెందిన త్రిషష్టురెడ్డి ఎద్దులు 2532, నాగర్‌కర్నూలుకు చెందిన అకిలేష్‌రెడ్డి ఎద్దులు 2524, గుంటూరు జిల్లాకు చెందిన త్రిషష్టురెడ్డి ఎద్దులు 2512, నంద్యాలకు చెందిన డాక్టర్ గురున్నాథ్ ఎద్దులు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి

2508 అడుగుల దూరం లాగాయి. వీరికి మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండవ బహుమతి రూ.80 వేలు, మూడవ బహుమతి రూ.60 వేలు, నాల్గవ బహుమతి రూ.50 వేలు, 5వ బహుమతి రూ.40 వేలు, 6వ బహుమతి రూ.30 వేలు, 7వ బహుమతి రూ.20 వేలు, 8వ బహుమతి రూ.10 వేల నగదు బహుమతులను జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి అందించారు. మిగిలిన ఎద్దులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

అనంత, నెల్లూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం అనంతపురం, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్ఆర్‌ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు 44.5 ఓవర్లలో 168 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రెడ్డిరుషీల్ 50 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ సయ్యద్ షావుల్ హమీద్ 3, సుతేజ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 48.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని షావుల్ హమీద్ 72 పరుగులు చేశాడు. దీంతో నెల్లూరు జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

'అనంత' భారీ విజయం

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది.


క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న నెల్లూరు, చిత్తూరు జట్లు

నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. జట్టులోని పి.అర్జున్ టెండూల్కర్ 73, ప్రశాంత్ 67, జయంత్ కృష్ణ 62 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్ అశోక్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది. జట్టులోని ఎ.సాయిసూర్యతేజ్‌రెడ్డి 117 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సర్‌లతో 112 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంత బౌలర్ లీలాసాయి 3 వికెట్లు తీశాడు. దీంతో అనంతపురం జట్టు 72 పరుగుల తేడాతో విజయం సాధించింది.

బంగారు గొలుసు అప్పగింత

మదనపల్లె సిటీ : బస్సులోని ప్రయాణికురాలు జారవిడుచుకున్న బంగారు హారంను సోమవారం స్థానిక వన్‌డిపోలో బాధితురాలికి అప్పగించారు. మదనపల్లె వన్ డిపో నుంచి రాయచోటికి ఉదయం 9.45 గంటలకు బస్సు బయలుదేరింది. ఇదే బస్సులో వెళ్తున్న షేక్ నౌజియా అనే ప్రయాణికురాలు 50 గ్రాములు బంగారు హారంను జారవిడుచుకుంది. బంగారు హారంను గమనించిన కండక్టర్ జీవీ గోపాల్ తీసుకుని డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డికి అప్పగించారు. తగిన ఆధారాలు చూపించిన ప్రయాణికురాలు షేక్ నౌజియాకు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాలపై దూసుకెళ్లిన టిప్పర్

పోరుమామిళ్ల : మండలంలోని రామేశ్వరం గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న మూగజీవాలపై టిప్పర్ దూసుకెళ్లడంతో 7 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఆదివారం అర్ధరాత్రి వాన పడుతుండటంతో పొలంలో ఉన్న మేకలను యజమానులు నారాయణరెడ్డి, లక్షుమయ్యలు ఇంటికి (రామేశ్వరం) తోలుకొస్తుండగా ఈ సంఘటన జరిగింది. కొమరోలు వైపు నుంచి పోరుమామిళ్ల వస్తున్న టిప్పర్ మేకలను తొక్కించి డ్రైవర్ ఆపకుండా వెళ్లాడు. వెనుక వస్తున్న కారులో ఉన్న వారికి ఈ సంఘటన గురించి మేకల యజమానులు తెలిపారు. కారు డ్రైవర్ వేగంగా వెళ్లి టిప్పర్ నంబర్ గుర్తించి, పట్టణ శివారులో చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న పోలీసులకు తెలిపినట్లు తెలిసింది. అయితే వెనుక వస్తున్న టిప్పర్ పోరుమామిళ్ల రాకుండా వేరే దారిలో పరారయినట్లు తెలుస్తోంది. దీనిపై ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని వివరణ అడగగా.. మేకల యజమానులు ఇంకా ఫిర్యాదు ఇవ్వలేదని, ఫోన్ చేసి రమ్మన్నామన్నారు.


మృతి చెందిన మేకలు

బోల్తా పడి కారు దగ్ధం

శ్రీనివాసపురం : కర్ణాటకలో కోలారు జిల్లా శ్రీనివాసపురం తాలూకాలోని రాయల్పాడు క్రాస్ వద్ద ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో అదుపు తప్పి బోల్తా పడిన కారులో మంటలు చెలరేగి పూర్తిగా కాలి పోయింది. మంటలు చెలరేగగానే కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు బయటకు రావడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన ఇంతియాజ్ అనే వ్యక్తి బెంగుళూరులో ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. సొంత కారులో కడపకు వెళుతున్న సమయంలో రాయల్పాడు క్రాస్ వద్ద అదుపు తప్పి మోరీ కిందకు ఫల్టీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.


మంటల్లో కాలిపోతున్న కారు

స్కూల్ బస్సు, బైక్ ఢీకొని విద్యార్థిని దుర్మరణం

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని బయపురెడ్డి మిల్లు సమీపంలో ఉన్న విశ్వజ్యోతి స్కూల్ బస్సు, బైక్ ఢీకొని.. అదే పాఠశాలకు చెందిన డి.షఫీన జుయిన్ (4) అనే విద్యార్థిని సోమవారం దుర్మరణం చెందింది. ఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగులోని మహబూబ్‌నగర్ వీధికి చెందిన మహమ్మద్ గౌస్ భార్య రేష్మాలకు షగుప్త అంబర్ (7,) షఫీన జుయిన్(4) అనే ఇద్దరు కూతుర్లు కలరు. వారిని పట్టణంలోని విశ్వజ్యోతి పాఠశాలలో చదివిస్తున్నారు. తండ్రి పట్టణంలోని చికెన్ వ్యాపార చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం తండ్రి మహమ్మద్ గౌస్ ఇరువురు కూతుర్లను స్కూటర్‌లో కూర్చోబెట్టుకొని పాఠశాలలో వదిలేందుకు బయలు దేరాడు. పాఠశాల సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా విశ్వజ్యోతి పాఠశాలకు చెందిన బస్సు వచ్చి వచ్చింది. ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మహమ్మద్ గౌస్, షగుప్త అంబర్ ఒక వైపు కింద పడగా, షఫీన జుయిన్ మరో వైపు కింద పడింది. ఎదరుగా వస్తున్న పాఠశాల బస్సు విద్యార్థిని తలపై దూసుకెళ్లింది. దీంతో బాలిక మెదడు అంతా చిట్లిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి, బంధువులు సంఘటన స్థలానికి వచ్చి చూసి బోరున విలపించారు. అనంతరం బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక తండ్రి మహమ్మద్ గౌస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.


షఫీన జుయిన్(ఫైల్)

కిడ్నాప్ చేశారంటూ విద్యార్థిని ఫిర్యాదు

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని (14) తనను ఎవరో కారులో కిడ్నాప్ చేశారని పోలీసులకు సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. కడప నగరంలోని ఆర్‌కె నగర్‌కు చెందిన సదరు విద్యార్థిని ప్రతి రోజూ పాఠశాలకు వస్తోంది. ఈక్రమంలో సోమవారం కూడా తాను పాఠశాలకు వెళ్లానని, సాయంత్రం ఎవరో గుర్తు తెలియని వారు వచ్చి తనను కారులో ఎక్కించుకుని అప్సర హాలు సమీపంలోకి రాగానే, కారు ఆపారని, వెంటనే తాను దిగేసి వచ్చానని తెలియజేసింది. విద్యార్థిని చెప్పిన కారు నంబర్‌ను రికార్డుల్లో పరిశీలిస్తే ఓ ద్విచక్రవాహనంగా పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ జరిగిన ఆనవాళ్లపై పోలీసులు చిన్నచౌక్ సీఐ శ్రీరామ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరిశీలిస్తున్నారు. ఆ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు వారు తెలియజేశారు.

సీతమ్మకు బంగారు హారం సమర్పణ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో సోమవారం సీతారాములకు పౌర్ణమి కల్యాణం నిర్వహిస్తుండగా హైదరాబాద్‌కు చెందిన సి.ఎస్.ఎన్ మూర్తి అనే వ్యక్తి సతీసమేతంగా సీతమ్మ వారికి పాదవాటి బంగారు హారం సమర్పించినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు తెలిపారు. ఈ హారం విలువ 2 లక్షల 70 వేల 316 రూపాయలని, బరువు 39 గ్రాములని ఆయన పేర్కొన్నారు. ఈ హారాన్ని తనకు అందజేసినట్లు చెప్పారు.


ఆలయ ఇన్‌స్పెక్టర్‌కు బంగారు హారం అందజేస్తున్న దృశ్యం

తాళ్లపాకలో వాహనసేవలు రద్దు

రాజంపేట : తాళ్లపాకలో సోమవారం బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించాల్సిన వాహనసేవలను రద్దు చేశారు. శ్రీ సిద్దేశ్వరుడు నందిపైన, శ్రీ చెన్నకేశవస్వామి గరుడవాహనంపై ఊరేగించాల్సి ఉంది. గ్రామంలో ఒకరు చనిపోయినందువల్ల వాహనాల ఊరేగింపులు రద్దు చేసుకున్నారు. కేవలం స్వామివారి గర్భాలయంలో హారతి ఇచ్చి, మళ్లీ ఉత్సవమూర్తులను లోపల పెట్టేశారు.


గుడిలో ఉత్సవమూర్తికి పూజలు చేస్తున్న దృశ్యం

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 486	65,205
నిఫ్టీ ▲ 134	19,323

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,817	▲	29
డోజోన్స్	34,418	▲	11
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,527	▽	4
డాక్స్	16,081	▽	67
షాంఘై	3,244	▲	42
నికాయ్	33,753	▲	564

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో	ముంబై
బంగారం (24 క్యారట్)	57,730
బంగారం (22 క్యారట్)	54,980
వెండి (కిలో)	75,500

జియో భారత్ ఫోన్ @ రూ. 999

రూ. 123 నెలవారీ ప్లాన్‌తో అపరిమిత కాల్స్, 14 జీబీ డేటా



న్యూఢిల్లీ: టెలికం సంస్థ జియో తాజాగా ఇంటర్నెట్ ఆధారిత చౌక 'జియో భారత్' మొబైల్ ఫోన్లను ఆవిష్కరించింది. దీని ధర రూ. 999. నెలవారీ రీచార్జి రూ. 123గా ఉంటుంది. దీనితో అపరిమిత వాయిస్ కాల్స్, 14 జీబీ డేటా లభిస్తుంది. జూలై 7 నుంచి 10 లక్షల పైచిలుకు జియో భారత్ ఫోన్ల ప్రయోగాత్మక ట్రయల్స్ ప్రారంభమవుతాయని జియో ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర ఆపరేటర్లు అందిస్తున్న ఫీచర్ ఫోన్ నెలవారీ ప్లాన్లతో పోలిస్తే 30 శాతం చౌకగా, 7 రెట్లు ఎక్కువ డేటాను యూజర్లు పొందవచ్చని పేర్కొంది. 2జీ విముక్త భారత్ లక్ష్య సాధనను వేగవంతం చేసే దిశగా జియో ఈ మొబైల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 25 కోట్ల పైచిలుకు 2జీ ఫీచర్ ఫోన్లను వాడుతున్నారని అంచనా. ఒకవైపు ప్రపంచం 5జీ విప్లవం ముంగిట నిల్చుండగా.. 25 కోట్ల మంది ఇంకా 2జీ శకంలోనే చిక్కుబడిపోయి ఉన్నారని, ప్రాథమిక ఇంటర్నెట్ ప్రయోజనాలను కూడా పొందడం లేదని రిలయన్స్ జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ తెలిపారు. డిజిటల్ సమాజంలో.. టెక్నాలజీ ప్రయోజనాలు ఏ కొందరికో పరిమితం కాకుండా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జియో భారత్ ఫోన్ మరో ముందడుగని ఆయన పేర్కొన్నారు.

ప్రియం కానున్న టాటా కార్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ ధరలను సవరిస్తున్నట్టు ప్రకటించింది. సగటున 0.6 శాతం ధర పెంచుతున్నట్టు సోమవారం వెల్లడించింది. తయారీ వ్యయం పెరగడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్‌తోసహా అన్ని మోడళ్లు, వేరియంట్లకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. కొత్త ధరలు జూలై 17 నుంచి అమలులోకి వస్తాయని టాటా మోటార్స్ తెలిపింది. జూలై 16 వరకు నమోదయ్యే బుకింగ్స్, జూలై 31లోగా జరిగే డెలివరీలకు పాత ధరలు వర్తిస్తాయని వెల్లడించింది

సెన్సెక్స్ @ 65000

- 19,300 పైకి నిఫ్టీ
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- ఇంధన, ఆర్థిక, మెటల్ షేర్లకు డిమాండ్
- మూడోరోజూ కొత్త రికార్డుల నమోదు



సెన్సెక్స్ మైలురాళ్లు

స్థాయి	అందుకున్న తేది
65,000	జూలై 03 2023
64,000	జూన్ 28 2023
63,000	నవంబర్ 30 2022
62,000	అక్టోబర్ 19 2021
61,000	అక్టోబర్ 14 2021

ముంబై: సానుకూల జాతీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో స్టాక్ సూచీల రికార్డు ర్యాలీ సోమవారమూ కొనసాగింది. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్ ద్వయం షేర్లు రాణించడం, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కలిసొచ్చాయి. దేశీయంగా మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. సెన్సెక్స్ ఉదయం 117 పాయింట్ల లాభంతో 64,836 వద్ద మొదలైంది. నిఫ్టీ 58 పాయింట్లు పెరిగి 19,247 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. తొలి గంట తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే మిడ్‌సెషన్ సమయంలో యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఇంధన, ఆర్థిక, మెటల్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో అధికంగా కొనుగోళ్లు జరిగాయి. ఇంట్రాడేలో వరుసగా మూడోరోజూ సెన్సెక్స్ 581 పాయింట్లు పెరిగి 65,300 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు బలపడి 19,345 కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. చివరికి సెన్సెక్స్ 486 పాయింట్ల లాభంతో 65,205 వద్ద ముగిసింది. ఈ సూచీకిది వరుసగా నాలుగోరోజూ లాభాల ముగింపు. మార్కెట్ ముగిసేసరికి 134 పాయింట్లు బలపడి 19,323 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకూ డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు 0.56%, 0.30% చొప్పున లాభపడ్డాయి. జూన్ వాహన విక్రయాలు అంతంత మాత్రంగా ఉండటంతో ఆటో షేర్లు నష్టపోయాయి. ఐటీ, టెక్, విద్యుత్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలపడి 81.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ అరశాతానికి పైగా ర్యాలీ చేయడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.1.73 లక్షల కోట్లు పెరిగి జీవితకాల గరిష్ట స్థాయి రూ.2.98 లక్షల కోట్లకు చేరింది. ద్రవ్యోల్బణం దిగిరావడంతో కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల సైకిల్‌ను ఆపేయొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఆసియాలో జపాన్ ఇండెక్స్ నికాయ్ 33 ఏళ్ల గరిష్టం(33,753) ముగిసింది.

''మార్కెట్లో కొనసాగుతున్న ర్యాలీతో పలు షేర్ల వాల్యూయేషన్లు భారీగా పెరిగాయి. నిఫ్టీ ఎఫ్‌వై 24 ఆదాయ అంచనాకు 20 రెట్ల అధిక ప్రీమియంతో ట్రేడవుతోంది. ఇది చరిత్రాత్మక సగటు కంటే ఎక్కువ. ప్రస్తుతం నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే వీలుంది. ఏదైన చిన్న ప్రతికూలాంశం అనూహ్య దిద్దుబాటుకు దారి తీయవచ్చు. కావున పెట్టుబడులు పెట్టేటప్పుడు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించాలి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహకర్త వీకే విజయ కుమార్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- విలీనం తర్వాత తొలి ట్రేడింగ్ సెషన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు సానుకూలంగా స్పందించాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు వరుసగా 4%, 3% చొప్పున ర్యాలీ చేసి రూ.2,926 వద్ద, రూ.1,758 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకాయి. చివరికి హెచ్‌డీఎఫ్‌సీ షేరు 2% లాభంతో రూ.2,871 వద్ద ముగిసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు ఒక శాతం పెరిగి రూ.1,719 వద్ద స్థిరపడింది. మొత్తంగా ఈ రెండు కంపెనీల మార్కెట్ విలువ రూ.14.93 లక్షల కోటక్లు పెరిగింది.
- ఎన్ఎస్ఈలో బ్యాంక్ నిఫ్టీ సూచీ ఏడాది గరిష్టం (45,353) తాకింది. చివరికి ఒకశాతం లాభంతో 45,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఫైనాన్సియల్ సర్వీసెస్ ఇండెక్స్ సైతం 52 వారాల గరిష్టం(20,398) అందుకొని ఆఖరికి 1% లాభంతో 20,253 వద్ద నిలిచింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం జీవితకాల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి.

మైక్రోచిప్.. రూ.2,460 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంబెడెడ్ కంట్రోల్ సొల్యూషన్స్‌లో ఉన్న యూఎస్ కంపెనీ మైక్రోచిప్ టెక్నాలజీ భారత్‌లో రూ.2,460 కోట్ల పెట్టుబడి చేయనున్నట్టు ప్రకటించింది. కార్యకలాపాల విస్తరణ, ఇంజనీరింగ్ ల్యాబ్స్, నిపుణుల నియామకం, సాంకేతిక కేంద్రాలకు మద్దతు, విద్యా సంస్థలకు ఈ మొత్తాన్ని వెచ్చించనుంది. కాగా, ఇక్కడి కోకాపేట్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న వన్ గోల్డెన్ మైల్ ఆఫీస్ టవర్‌లో 5 అంతస్తులను కంపెనీ కొనుగోలు చేసింది. పరిశోధన, అభివృద్ధి కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చింది. ఈ కేంద్రంలో 1,000 మంది ఉద్యోగులు కూర్చునే వీలుంది. భారత్‌లో కార్యకలాపాలను పెంపొందించడానికి మైక్రోచిప్ ముఖ్యమైన వ్యూహాత్మక నిబద్ధతను ప్రకటించిందని సంస్థ ప్రెసిడెంట్, సీఈవో గణేశ్ మూర్తి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఇండస్ట్రియల్, డేటా సెంటర్, కంప్యూటింగ్, ఆటోమోటివ్, కంస్యూమర్ అప్లయాన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు మైక్రోచిప్ సేవలు అందిస్తోంది.

గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ ప్రారంభం..

తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల లావాదేవీలు



గాంధీనగర్: సింగపూర్ ఎస్‌జీఎక్స్ నిఫ్టీ స్థానంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్ నిఫ్టీలో సోమవారం నుంచి ట్రేడింగ్ ప్రారంభమైంది. ఎస్‌జీఎక్స్ నిఫ్టీకి సంబంధించిన 9.4 బిలియన్ డాలర్ల ఓపెన్ ఇంట్రెస్ట్‌ను గిఫ్ట్ నిఫ్టీకి బదలాయించగా.. మొదటి రోజున తొలి సెషన్‌లో 1.12 బిలియన్ డాలర్ల విలువ చేసే లావాదేవీల పరిమాణం నమోదైంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో గిఫ్ట్ నిఫ్టీ ట్రేడింగ్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు తమ ట్రేడింగ్‌లో కొంత భాగం విదేశాల్లో జరిగేదని, ఇప్పుడిక పూర్తిగా దేశీయంగానే నిర్వహించవచ్చని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ఎండీ ఆశీష్ చౌహాన్, ఎన్ఎస్ఈ ఐఎక్స్ ఎండీ వి. బాలసుబ్రమణియమ్ తెలిపారు.

రెండు సెషన్లలో.. దాదాపు 21 గంటలు..
గిఫ్ట్ నిఫ్టీలో ట్రేడింగ్ అంతా అమెరికన్ డాలర్ల మారకంలో జరుగుతుంది. ఉదయం 6.30 గం.ల నుంచి మరుసటి రోజు 2.45 గం.ల వరకు రెండు సెషన్లుగా, దాదాపు 21 గంటల పాటు ఇందులో ట్రేడింగ్ కొనసాగుతుంది. తొలుత గిఫ్ట్ నిఫ్టీ 50, గిఫ్ట్ నిఫ్టీ బ్యాంక్, గిఫ్ట్ నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, గిఫ్ట్ నిఫ్టీ ఐటీ డెరివేటివ్ కాంట్రాక్టులు ఎన్ఎస్ఈ ఐఎక్స్‌లో అందుబాటులో ఉంటాయి. తర్వాత మరిన్ని సూచీలను క్రమంగా అందుబాటులోకి తెస్తారు. సాధారణంగా దేశీ మార్కెట్ల ఓపెనింగ్‌ను అంచనా వేసేందుకు ట్రేడర్లు ఎస్‌జీఎక్స్ నిఫ్టీని పరిగణనలోకి తీసుకుంటారు.

ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఐడీఎఫ్‌సీ విలీనానికి ఓకే

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో మాతృ సంస్థ ఐడీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనం కానుంది. పూర్తిగా షేర్ల మార్పిడి ద్వారా లావాదేవీని చేపట్టనున్నారు. ఇందుకు రెండు సంస్థల బోర్డులూ ఆమోదించినట్లు ఐడీఎఫ్‌సీ, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తాజాగా వెల్లడించాయి. విలీన ప్రతిపాదన ప్రకారం ఐడీఎఫ్‌సీ వాటాదారులకు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 155 ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేర్లు జారీ చేయనున్నారు. ప్రధానంగా మౌలిక రంగానికి రుణాలందించే ఐడీఎఫ్‌సీ 1997లో ఆవిర్భవించింది. 2015లో ఐసీఐసీఐ, ఐడీబీఐ తరహాలో బ్యాంకింగ్ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. 2018 డిసెంబర్‌లో క్యాపిటల్ ఫస్ట్‌ను టేకోవర్ చేసింది.

పవన్ హన్స్ విక్రయం రద్దు

గెలుపొందిన బిడ్డర్ అనర్హత ఎఫెక్ట్



న్యూఢిల్లీ: హెలికాప్టర్ సర్వీసుల పీఎస్‌యూ పవన్ హన్స్ లో వ్యూహాత్మక వాటా విక్రయానికి బ్రేక్ పడింది. బిడ్డింగ్‌లో విజయవంతమైన కన్సార్షియంలోని ఒక కంపెనీపై న్యాయపరమైన వివాదాల రీత్యా అనర్హతవేటు పడటం దీనికి కారణమని దీపమ్ పేర్కొంది. వెరసి పవన్ హంస్ ప్రయివేటైజేషన్ ప్రయత్నాలకు మూడోసారి చెక్ పడింది. బిడ్‌ను గెలుపొందిన స్టార్9 మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ కన్సార్షియంలోని అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీ ఫండ్ ఎస్‌పీసీపై పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం పవన్ హంస్ డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయాన్ని రద్దు చేసినట్లు దీపమ్ తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ పవన్ హంస్‌లో ప్రభుత్వానికి 51 శాతం, ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీకి 49 శాతం చొప్పున వాటా ఉంది.

2018లో షురూ: తొలుత పవన్ హన్స్ లో గల 51 శాతం వాటా విక్రయానికి ప్రభుత్వం 2018లో బిడ్స్‌కు ఆహ్వానం పలికింది. అయితే ఓఎన్‌జీసీ సైతం 49 శాతం వాటాను విక్రయించేందుకు సిద్ధపడటంతో నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. 2019లో తిరిగి కంపెనీలో 100 శాతం వాటా విక్రయానికి బిడ్స్‌ను ఆహ్వానించినప్పటికీ స్పందన లభించకపోవడం గమనార్హం! ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో మూడోసారి పవన్ హన్స్ విక్రయానికి తెరతీసింది. కంపెనీ కొనుగోలుకి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్స్‌ను ఆహ్వానించింది. 2022 ఏప్రిల్‌లో స్టార్9 మొబిలిటీ కన్సార్షియం గరిష్ట బిడ్డర్‌గా నిలిచింది. కన్సార్షియంలో అల్మాస్ గ్లోబల్ అపార్చునిటీసహా.. బిగ్ చార్టర్ ప్రయివేట్ లిమిటెడ్, మహరాజ ఏవియేషన్ ప్రయివేట్ లిమిటెడ్ సైతం భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 1000 మేనేజర్ స్కేల్-2 పోస్టులు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంకు శాఖల్లో మెయిన్ స్ట్రీమ్ కేటగిరీలో మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 1000
- » అర్హత: ఏదైనా డిగ్రీ, సీఏఐఐబీ ఉత్తీర్ణులై ఉండాలి. పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో ఆఫీసర్‌గా మూడేళ్ల పని అనుభవం ఉండాలి(లేదా) పీఎస్‌బీ/ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్/ఆర్ఆర్‌బీలో క్లర్క్‌గా ఆరేళ్ల పని అనుభవంతోపాటు సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంసీఏ/పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » వయసు: 31.05.2023 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
- » పే స్కేల్: నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
- » పోస్టింగ్ స్థలం: దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.07.2023
- » ఆన్‌లైన్ పరీక్ష తేదీ: ఆగస్టు రెండు/మూడో వారం
- » వెబ్‌సైట్: www.centralbankofindia.co.in

ఐబీపీఎస్ 4,045 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్).. 2024-25 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-XIII.. క్లర్క్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 4,045 క్లర్క్ పోస్టులు
- » అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
- » వయసు: 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » ఎంపిక విధానం: రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష ఉంటుంది. మొదట 100 మార్కులకు ప్రిలిమ్స్, రెండో దశలో 200 మార్కులకు మెయిన్స్ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి మాత్రమే మెయిన్స్ రాసే అవకాశం ఉంటుంది.
- » ప్రిలిమినరీ పరీక్ష తేదీ: 2023 ఆగస్టు/సెప్టెంబర్లో
- » మెయిన్స్ పరీక్ష తేదీ: అక్టోబర్ 2023లో నిర్వహిస్తారు
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.07.2023
- » వెబ్‌సైట్: www.ibps.in

కేజీబీవీల్లో 1241 కొలువులు



కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)లు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్)ల్లో 1241 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసే ఈ పోస్టులకు ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూన్ 26 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోస్టుల సంఖ్య, అర్హతలు, ఎంపిక విధానం, పరీక్ష స్వరూపం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

పోస్టుల వివరాలు

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), పోస్టు గ్రాడ్యుయేట్ కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(పీజీ సీఆర్‌టీ), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ) పోస్టులు; అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యూఆర్ ఎస్)ల్లో.. స్పెషల్ ఆఫీసర్స్(ఎస్‌వో), కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్స్(సీఆర్‌టీ) పోస్టులు భర్తీ చేయనున్నారు.

మొత్తం పోస్టుల సంఖ్య: 1241

- **కేజీబీవీ-పోస్టులు 1218:** స్పెషల్ ఆఫీసర్-38, పీజీ సీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీ సీఆర్‌టీ(మ్యాథమేటిక్స్)-60, పీజీ సీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీ సీఆర్‌టీ(తెలుగు)-104, పీజీ సీఆర్‌టీ(ఉర్దూ)-2, పీజీ సీఆర్‌టీ(బోటనీ)-55, పీజీ సీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69, పీజీ సీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీ సీఆర్‌టీ(కామర్స్)-70, పీజీ సీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీ సీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీ సీఆర్‌టీ(జువాలజీ)-54, సీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ(మ్యాథమెటిక్స్)-45, సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77.
- **యూఆర్ఎస్-మొత్తం పోస్టులు-23:** స్పెషల్ ఆఫీసర్-4, సీఆర్‌టీ(తెలుగు)-5, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-5, సీఆర్‌టీ(సైన్స్)-6, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-3

విద్యార్హతలు

- **పీజీసీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ తోపాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి.
- **స్పెషల్ ఆఫీసర్:** కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేసి ఉండాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణత సాధించాలి.
- **సీఆర్‌టీ:** 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ పూర్తి చేయాలి. తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్)/ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (2014.06.02 కంటే ముందు నిర్వహించిన ఏపీ టెట్)/సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పేపర్ 2లో ఉత్తీర్ణతఉండాలి.
- **పీఈటీ:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్/డిప్లొమా ఉండాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు కనీసం ఏడాది వ్యవధి ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ)లో ఉత్తీర్ణత సాధించాలి.
- కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, సీఆర్‌టీ, పీఈటీ, పీజీసీఆర్‌టీ పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు దివ్యాంగులు అనర్హులు.

వయసు

2023 జూలై 1 నాటికి అభ్యర్థుల వయసు 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల ప్రతిభ, టెట్ స్కోరు, అనుభవం ఆధారంగా తుది ఎంపిక చేస్తారు. అన్ని పోస్టులకు రాత పరీక్షలో అర్హత సాధించాలంటే.. ఓసీ అభ్యర్థులు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి. పీఈటీ పోస్టులకు రాతపరీక్షలో మార్కుల(100 శాతం వెయిటేజీ) ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష స్వరూపం

- **పీజీసీఆర్‌టీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **స్పెషల్ ఆఫీసర్:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **సీఆర్‌టీ:** ఇందులో కూడా మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, బేసిక్ ప్రొఫిషీయెన్సీ ఇన్ ఇంగ్లిష్, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, సబ్జెక్టు కంటెంట్, పెడగాజీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- **పీఈటీ:** మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష కాలవ్యవధి 120 నిమిషాలు. జనరల్ స్టడీస్, జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఫిజియాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, శిక్షణ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: జూలై 5, 2023
- రాత పరీక్ష తేది: జూలై 2023
- వెబ్‌సైట్: https://schooledu.telangana.gov.in

ఐఐటీల్లో కొత్త కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా విద్యార్థుల కోసం పలు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఐఐటీ గాంధీనగర్ బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును రూపొందించింది. ఐఐటీ-ఇండోర్, ఐఐటీ-పాట్నాలో బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, ఐఐటీ బాంబేలో డ్యూయల్ డిగ్రీ ఇన్ క్వాంటం టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు తగిన కోర్సు ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఆయా కోర్సుల తీరుతెన్నులు, ప్రవేశం విధానం, కెరీర్ అవకాశాలు తదితర వివరాలు..

ఐఐటీ ఇండోర్

ఈ ఏడాది ఐఐటీ ఇండోర్ ఎక్కువ సంఖ్యలో కొత్త కోర్సులను ప్రారంభించింది. బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ ఫిజిక్స్, బీటెక్ ఇన్ మ్యాథమేటిక్స్ అండ్ కంప్యూటింగ్, బీటెక్ ఇన్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. 2023-24 విద్యాసంవత్సరం నుంచి ఐఐటీ ఇండోర్ ఈ కోర్సులలో ప్రవేశాలను ప్రారంభించనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

ఐఐటీ పాట్నా

ఐఐటీ పాట్నా ఈ సంవత్సరం ఇంజనీరింగ్ ఫిజిక్స్‌లో కొత్తగా బీటెక్‌ను ప్రారంభించింది. ఫిజిక్స్‌లో ధ్వని శిక్షణ, విద్యార్థులకు సరికొత్త టెక్నాలజీలను పరిచయం చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశం. సమకాలీన ఫిజిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌ను మిళితం చేసి విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ రెండింటిలో సమాన సామర్థ్యాలుండే నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ కోర్సు లక్ష్యం.

ఐఐటీ బాంబే

ఐఐటీ బాంబే క్వాంటమ్ టెక్నాలజీలో ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఐడీడీపీ)ను త్వరలో ప్రారంభించనుంది. ఈ కోర్సును సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ క్వాంటం ఇన్ఫర్మేషన్ కంప్యూటింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(క్యూయూఐసీఎస్‌టీ) ఆఫర్ చేస్తోంది. ఐఐటీ బాంబేలో ఏదైనా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్) కోర్సులో చేరిన విద్యార్థులు ఐఐడీడీపీ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకోవచ్చు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్ నిర్మాణం ఇంకా ఖరారు కానప్పటికీ.. రెండేళ్ల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సులో క్వాంటం టెక్నాలజీతోపాటు క్యూయూఐసీఎస్‌టీకి అనుబంధంగా ఉన్న పరిశోధనా బృందంతో చేపట్టే ప్రాజెక్ట్ వర్క్‌కు ప్రాధాన్యతనివ్వనున్నారు. ఇతర డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల మాదిరిగానే ఈ కొత్త కోర్సులో చేరిన విద్యార్థులు ఐదేళ్ల వ్యవధిలో బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని పూర్తిచేస్తారు. బీటెక్ విద్యార్థులు సంబంధిత కోర్సు మూడవ సంవత్సరంలో ఈ ప్రోగ్రామ్‌ను ఎంచుకోవచ్చు.



ఐఐటీ జోధ్‌పూర్

ఐఐటీ జోధ్‌పూర్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్.. కొత్తగా బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ విత్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. బేసిక్ సైన్స్, అత్యాధునిక సాంకేతికతలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం ఈ కోర్సును తీసుకువచ్చారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణమైన స్పెషలైజేషన్ల ద్వారా వివిధ కెరీర్ మార్గాలను అందించడం ఈ కోర్సు లక్ష్యం. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోరు ఆధారంగా ఈ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తారు. నాలుగేళ్ల ఈ ప్రోగ్రామ్‌ను ఎనిమిది సెమిస్టర్‌లుగా విభజించారు.

ఐఐటీ హైదరాబాద్

ఐఐటీ, హైదరాబాద్.. బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మేటిక్స్‌లో పరిశ్రమ ఆధారిత బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ కోర్సును అభ్యసించే విద్యార్థులు బయోలాజికల్ డేటాను అర్థం చేసుకోవడానికి అవసరమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్‌లోనూ శిక్షణ పొందుతారు. ఇది ఎనిమిది సెమిస్టర్లు, నాలుగేళ్ల కాలవ్యవధి ఉన్న ఫుల్‌టైమ్ కోర్సు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకింగ్స్ ఆధారంగా అడ్మిషన్ కల్పిస్తారు.

ఐఐటీ గాంధీనగర్

ఐఐటీ, గాంధీనగర్.. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టింది. దీనిలోని కొన్ని సబ్జెక్టులు బీటెక్ కంప్యూటర్ సైన్స్‌లోని సబ్జెక్టులతో ఉమ్మడిగా ఉన్నప్పటికీ.. చాలా సబ్జెక్టులు భిన్నంగా ఉన్నాయి. ఏఐ, మెషిన్ లెర్నింగ్‌పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సును ఎంచుకోవచ్చు. ఏఐ, మెషిన్ లెర్నింగ్ లో విద్యార్థులు పట్టుసాధించేలా కరిక్యులాన్ని రూపొందించారు. అంతేకాకుండా ఎలక్టివ్స్ సౌకర్యం ఉండటంతో విద్యార్థులు ఏఐకు చెందిన వివిధ విభాగాలు, కంప్యూటర్ విజన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ తదితర అడ్వాన్స్‌డ్ ఏఐ అంశాలను ప్రత్యేకంగా ఎంచుకోవచ్చు.

ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా విద్యార్థులు పరిశ్రమలో అప్లయిడ్ ఏఐలో అద్భుత కెరీర్ సొంతం చేసుకోవచ్చు. బీటెక్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును నాలుగేళ్లు, ఎనిమిది సెమిస్టర్‌లుగా పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా దీనిలో ప్రవేశం కల్పిస్తారు. ఐఐటీ పాట్నా, ఐఐటీ గువాహటిలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.